






పురస్కారం

డాక్టర్ పిన్నమనేని, సీతాదేవి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సోమనాథ్ ప్రసంగం ఆద్యంతం ఆసక్తిగా సాగింది.

శోభాయమానం



మహాశివరాత్రిని పురస్కరించుకుని యనమలకుదురు శివాలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. శుక్రవారం నాటి వేడుకలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు భారీ ఎత్తున ప్రభలను సిద్ధం చేస్తున్నారు.

“ మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన సుమారు రూ.10 కోట్ల విలువైన 90 సెంట్ల పార్కు స్థలమది. అధికార పార్టీ నాయకుల అండ కలిగిన ఒక బిల్డర్ కన్ను దానిపై పడింది. తప్పుడు పత్రాలు సృష్టించడమే కాదు.. ఇంటి నిర్మాణం నిమిత్తం బ్యాంకులో రుణాలు కూడా తీసుకున్నాడు. ప్లాట్లుగా విభజించి అమ్మకాలు మొదలుపెట్టాడు. పార్కు స్థలంలో ఎలాంటి కట్టడాలు చేయకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా.. యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు.

పార్కు స్థలంలో పక్కా స్కెచ్



నిజాంపేట పార్కు స్థలంలో నిర్మించిన భవనాలు



పార్కు స్థలం అంటూ మునిసిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

మచిలీపట్నంలోని నిజాంపేటలో అక్రమ నిర్మాణాలు

- అధికార పార్టీ అండతో ఓ బిల్డర్ బరితెగింపు
- నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకు రుణాలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసినా ఆగని నిర్మాణాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలోని నిజాంపేటలో ప్రసిద్ధి చెందిన ఒక దేవత గుడి ఉంది. ఈ గుడి ఎదురుగా కార్పొరేషన్ పరిధిలోని ఎల్‌పీ నెంబరు 64/93లో 90 సెంట్ల మేర పార్కు స్థలం ఉంది. ఇక్కడ సెంటు మార్కెట్ రేటు ప్రకారం రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షల ధర పలుకుతోంది. బిల్డరుగా అవతారమెత్తిన ఓ వ్యక్తి ఇక్కడ ఇళ్లు నిర్మిస్తున్నాడు. పార్కు స్థలానికి దొంగపత్రాలు సృష్టించాడు. ధనికులు అధికంగా నివసించే ఈ ప్రాంతంలోని పార్కు స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయాలు ప్రారంభించాడు. అంతటితో ఆగకుండా ఓ బ్యాంకు ద్వారా రుణాలు కూడా ఇప్పించాడు. 90 సెంట్ల పార్కు స్థలం మొత్తాన్ని విక్రయించేసి ఇక్కడ భవనాలు నిర్మిస్తున్నాడు.

స్పందనలో ఫిర్యాదు

పార్కు స్థలం ఆక్రమణపై స్థానికులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోలేదు. దీంతో నేరుగా స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. కలెక్టర్ ఆదేశాలతో మునిసిపల్ అధికారులు విచారణ చేశారు. పార్కు స్థలంగా నిర్ధారించి విక్రయించినట్లు గుర్తించారు. ఎలాంటి కట్టడాలు చేయకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. విశేషమేమిటంటే.. ఆ హెచ్చరిక బోర్డు పక్కనే ఇటీవల రెండు భవనాల నిర్మాణం చేపట్టడం. ఒక భవనాన్ని పూర్తిచేసి రంగులు కూడా వేశారు. మరో భవనం నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

స్తంభాలు పాతిన బ్యాంకు అధికారులు

నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లు విక్రయించడంతో పాటు ఈ ప్రాంతంలో భవనాలను నిర్మిస్తున్న బిల్డర్, అతని అనుయాయులు తమ పలుకుబడిని ఉపయోగించి మచిలీపట్నంలోని బ్యాంకు నుంచి ఇంటి నిర్మాణం నిమిత్తం రుణాలు కూడా ఇప్పించారు. పార్కు స్థలంలోని ప్లాట్లకు బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేశారు. ఈ అంశంపై విచారణ జరుగుతుండటంతో బ్యాంకు అధికారులు స్పందించారు. తాము రుణంగా ఇచ్చిన ప్లాట్లలో సిమెంట్ స్తంభాలను పాతి, వాటిపై బ్యాంకు ఫోన్ నెంబరు కూడా వేశారు.

మచిలీపట్నంలో బిల్డర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఎన్నికలొచ్చిన ప్రతిసారీ తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని హడావుడి చేస్తుంటాడు. ఆ తరువాత మిన్నకుండిపోతాడు. ఇతని కనుసన్నల్లోనే నిజాంపేటలోని పార్కు స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయించారు. నకిలీపత్రాలతో బ్యాంకు అధికారులను బురిడీ కొట్టించడం, రుణాలు తీసుకోవడం గమనించదగ్గ అంశం. స్థానికులు ఈ

అధికారులను సైతం బెదిరిస్తూ..

వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదు చేస్తే, విచారణ కోసం వెళ్లిన తమను ఈ బిల్డర్ బెదిరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఏ స్థాయి అధికారులైనా తనకు లెక్కలేదని, తన వ్యాపారానికి అడ్డొచ్చిన వారి సంగతి చూస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని అధికారులు వాపోతున్నారు. రూ.10 కోట్ల విలువైన పార్కు స్థలాన్ని విక్రయించి అడ్డంగా దొరికిపోయిన ఇతనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అధికారుల స్వామిభక్తి..!

ఎమ్మెల్యే పదవి ఊడినా వంశీ సేవలో అధికారులు

బస్టాండ్ ప్రారంభోత్సవంలో విమర్శలు.. అయినా బ్యాంకు ప్రారంభోత్సవంలోనూ..

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై అధికారులు స్వామిభక్తి చాటుతూ భజన చేస్తుండటంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. మంగళవారం హనుమాన్ జంక్షన్ బస్టాండ్ ప్రారంభోత్సవంలో మొదలైన ఈ భక్తి బుధవారం గన్నవరం, హనుమాన్ జంక్షన్లలో జరిగిన పలు ప్రారంభోత్సవాల్లోనూ కొనసాగింది. అధికారులు పెద్ద ఎత్తున ఆయన భజనలో తరిస్తున్నా ఆయన మాత్రం ఆయా కార్యక్రమాలకు ముఖం చాటేస్తున్నారు.

హనుమాన్ జంక్షన్, మార్చి 6 : గన్నవరంలోని వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో నూతనంగా నిర్మించిన గిడ్డంగులను బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ శిలాఫలకంపై వంశీని ఎమ్మెల్యేగా సంబోధించడంపై విపక్షాలు, నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కుతున్న అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని విపక్షాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 26నే ఎమ్మెల్యే హోదా కోల్పోయిన వంశీని ఇంకా ఎమ్మెల్యేగా సంబోధిస్తూ, ప్రొటోకాల్ పాటిస్తూ ఆహ్వానం పలకడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని వారు విమర్శిస్తున్నారు. మంగళవారం హనుమాన్ జంక్షన్‌లో ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు భారీ ఎత్తున స్వాగత సన్నాహాలు చేశారు. అయినా వంశీ గైర్హాజరయ్యారు. ఆయన అనుచరులు, అధి కార పార్టీకి చెందిన మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కూడా రాలేదు. బుధవారం కేడీసీసీ బ్యాంకు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాలేదు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి నాయకత్వంలో నూతన భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. శిలాఫలకంపై ఎమ్మెల్యేగా వంశీమోహన్ పేరును పేర్కొన్నారు. సీఎం జగన్, కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ఫొటోల మధ్య వంశీ ఫొటో కూడా అతికించి స్వాగతం పలకడం చర్చనీయాంశంగా మారింది.



బ్యాంక్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వంశీ అంటూ ఫొటోతో శిలాఫలకం

వంశీ ఎక్కడ?

మంగళవారం బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖం చాటేసిన వంశీ అనుచరులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు.. బుధవారం బ్యాంకు భవన ప్రారంభోత్సవానికి హాజరుకావడం గమనార్హం. అయితే, వంశీ మాత్రం ఈ కార్యక్రమాలకు రాలేదు. అయితే, మండల స్థాయిలో ఏదైనా అధికార పార్టీ కార్యక్రమాలు నిర్వహించాల్సి వచ్చినపుడు ఎమ్మెల్యే వంశీమోహన్ హాజరవుతున్నారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేస్తూ సభలకు జనాన్ని సమీకరించడం పరిపాటి. రెండు నెలల క్రితం బాపులపాడు గ్రామంలోని రెండో లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ చూపించే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్నారని నమ్మించి జనాన్ని సమీకరించారు. కానీ, వంశీ రాలేదు. గతనెలలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సొమ్ము విడుదల చేసిన సందర్భంగా భారీ ఎత్తున సభ నిర్వహించారు. ఆరోజు కూడా వంశీ వస్తున్నారని ప్రచారం చేశారు. ఆరోజు కూడా ఆయన హాజరు కాలేదు. కొంతకాలంగా పలు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వంశీమోహన్ ఏమైపోయారన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది.

మళ్లీ మొదటికి..!



అక్రమంగా తవ్విన గ్రావెల్‌ను అర్ధరాత్రి లారీల్లో తరలిస్తున్న దృశ్యం

విజయవాడ రూరల్‌లో మళ్లీ రెచ్చిపోతున్న వైసీపీ నేతలు

విజయవాడ రూరల్ మండలంలో వైసీపీ మైనింగ్ మాఫియా మళ్లీ రెచ్చిపోతోంది. ఎన్నికల కోడ్ వచ్చేలోపు గ్రావెల్‌ను ఇష్టానుసారంగా తవ్వేస్తోంది. కలెక్టర్ వచ్చి, పరిశీలించి అక్రమ క్వారీలను మూసివేసేలా ఆదేశాలిచ్చినా ఏమాత్రం భయం లేకుండా.. రెండు వారాలకే మళ్లీ పనులు చేపట్టారు. ‘కలెక్టర్ వస్తే ఏంటి? సీపీ ఏం చర్యలు తీసుకుంటారు? మాకు సీఎంవోలోనే పలుకుబడి ఉంది’ అంటూ మళ్లీ అక్రమ క్వారీయింగ్‌కు తెరలేపారు.

కొత్తూరు తాడేపల్లిలో భారీగా అక్రమ మైనింగ్

- అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు
- కలెక్టర్ పరిశీలించి వెళ్లిన రెండు వారాలకే..
- వెలగలేరులో రంగంలోకి దిగిన మైనింగ్ బ్రదర్స్
- అక్రమార్కులపై చర్యలకు కలెక్టర్ సిఫార్సు
- సీఎంవో అండతో బరితెగిస్తున్న వైసీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలంలో విధ్వంసకరంగా కొనసాగుతున్న మైనింగ్ మాఫియాకు ఎవరూ అడ్డుకట్ట వేయలేకపోయారని తేలిపోయింది. చట్టాలంటే కొంచెం కూడా భయం లేని వైసీపీ మైనింగ్ మాఫియా ఎన్నికల వేళ మరింత పేట్రేగిపోతోంది. ఎన్నికల కోడ్ వస్తే ఆటలు సాగవేమోనన్న ఉద్దేశంతో రెచ్చిపోతోంది. నైనవరానికి చెందిన వైసీపీ నాయకులు కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ ప్రారంభించాడు. తాడేపల్లిలోని సర్వే నెంబర్ 260 దగ్గర్లోని కొండ సమీపంలో తాను కొన్న అసైన్డ్ భూముల్లో రాత్రికి రాత్రి అక్రమ మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించాడు. సర్పంచ్‌గా ఓడిపోయినా, రాష్ట్రంలో ఉన్నది తమ పార్టీయే కాబట్టి ఇప్పటికే విచ్చలవిడిగా అక్రమ క్వారీయింగ్ చేపట్టాడు. ఇవి చాలవన్నట్టు ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో అసైన్డ్ భూములు కొన్నాడు. ఇవన్నీ కూడా కొండ పోరంబోకు భూములు. గ్రావెల్ నిక్షేపాలు కలిగినవి. ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో హడావిడిగా ఈ భూములు కొన్నారు. నోటిఫికేషన్ వస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో ఈ కాస్త గ్యాప్‌లోనే గ్రావెల్‌ను తరలించుకుపోవాలన్న ఎత్తుగడతో అర్ధరాత్రి సమయాన్ని ఎంచుకున్నారు. సమీప పొలాల్లో దాచిన ఎక్స్‌కవేటర్లను రాత్రి 11 గంటలకు బయటకు తీస్తున్నారు. 11.30 గంటలకల్లా లారీలన్నీ గ్రావెల్ కోసం క్యూ కడుతున్నాయి. వెంటనే ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్‌ను తవ్వి లారీల్లో నింపుతున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన మార్గం మీదుగానే లారీలు రాత్రుళ్లు ప్రయాణిస్తున్నాయి. తెల్లవారుజామున 5 గంటల వరకూ ఈ క్వారీయింగ్ సాగుతోంది.

వెలగలేరు చేరిన మైనింగ్ బ్రదర్స్

వెలగలేరులో అక్రమ మైనింగ్ మళ్లీ ప్రారంభమైంది. మైనింగ్ బ్రదర్స్‌గా పేరొందిన ఇద్దరు నేతలు మొన్నటి వరకు వైసీపీ నేతలు. అధికార పార్టీని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా తవ్వేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కి ఇచ్చిన ఫిర్యాదులో వీరిద్దరి గురించి ప్రస్తావించారు. అప్పటికే కొత్తూరు తాడేపల్లిలో తవ్వకాలు పూర్తి చేశారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అప్పట్లో విజయవాడ సబ్ కలెక్టర్ తనిఖీలకు వస్తుండటంతో.. వాహనాలు ముందుకు కదలకుండా రోడ్డును తవ్వించిన ఘనులు కూడా వీరే. దీనిపై ఎన్‌జీటీ తీవ్రంగా స్పందించింది. మైనింగ్ బ్రదర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. తాజాగా మళ్లీ ఈ బ్రదర్స్ రెచ్చిపోతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు తవ్వేయాలని చూస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

ఫిర్యాదులు వచ్చినపుడు మైనింగ్ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. చర్యలు తీసుకోవాలని ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసినా అధికారులు ఆ దిశగా ముందడుగు వేయట్లేదు. దీంతో అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. ఎన్‌జీటీ ఆదేశాల ప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇటీవలే కలెక్టర్ ఢిల్లీరావు, పోలీసు కమిషనర్ కాంతిరాణాకు లేఖ రాశారు.

కలెక్టర్ ఆదేశాలిచ్చినా..

అక్రమ మైనింగ్ చేస్తున్న వైసీపీ నాయకుడిపై కలెక్టర్ ఢిల్లీరావుకు స్పందనలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. మెండెం జమలయ్య అనే స్థానికుడు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 244 ప్రభుత్వ అసైన్డ్ భూమిలో దాదాపు 80 అడుగుల లోతున తవ్వేయటాన్ని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఫిర్యాదు వచ్చిన అనంతరం కొద్దిరోజులకు కలెక్టర్ అక్రమ క్వారీయింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్రమ క్వారీయింగ్‌ను చూసి కలెక్టర్, జేసీలు ఆశ్చర్యపోయారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని, మళ్లీ తనకు ఒక్క ఫిర్యాదు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పి రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలను కూడా రెవెన్యూ, మైనింగ్ వ్యవస్థలు తేలిగ్గా తీసుకున్నాయి. మళ్లీ రాత్రిపూట వందలాది లారీల్లో అక్రమ క్వారీయింగ్‌తో గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా పట్టించుకోవటం లేదు. స్థానికులు మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవటం లేదు.

దీక్ష భగ్నం



విద్యార్థులకు సంబంధించిన రూ.2,750 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీడీపీ జిల్లా కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను పోలీసులు బుధవారం రాత్రి భగ్నం చేశారు.

- 6లో..

మండలితో జనసేన ఆశావహుల భేటీ

మండలి బుద్ధప్రసాద్‌ను కలిసిన కీలక నేతలు

- టీడీపీకి మద్దతుగా ఉంటామని హామీ
- తమకు టికెట్ వస్తే మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
- ముగ్గురు జనసేన నేతలు ఒకేరోజు సమావేశం

- 6లో..



ముస్తాబైన సంగమేశ్వరస్వామి ఆలయం, సంగమేశ్వరస్వామి(ఇన్‌సెట్‌లో)

నేటి నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నాగాయలంక, మార్చి 6 : సంగమేశ్వరం గ్రామంలో గంగాపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో సీహెచ్‌ సుధాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేసి, చలువ పందిళ్లు వేశారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరణ, సాయంత్రం 6 గంటలకు వినాయక పూజ, పుణ్యాహవచనం, అంకురారోహణ, ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, బలిహారణ, 8వ తేదీ ఉదయం 4.30 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు జగాజ్యోతి, 7 గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 8 గంటలకు స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం, లింగోద్భవ కాలంలో 108 కేజీల విభూదితో అభిషేకాలు, 9వ తేదీ రాత్రి 9 గంటలకు స్వామివారి రథోత్సవం, 10వ తేదీన ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, 10 గంటలకు పురవీధులలో ఊరేగింపు, సముద్ర విహారం, రాత్రి 10 గంటలకు పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉపాధి మండలి సభ్యులు

ఎన్టీఆర్‌ జిల్లాలో ఉపాధి పనుల పరిశీలన

కృష్ణలంక, మార్చి 6 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్‌) పనుల అమలు తీరును బుధవారం రాష్ట్ర ఉపాధి మండలి సభ్యులు పరిశీలించారు. విజయవాడ రూరల్‌, ఇబ్రహీంపట్నం మండలాల్లో వర్క్‌సైట్‌లను సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని సాధించిన అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన స్థానిక సంస్థలు, సొసైటీలు, ఇతర సంస్థల నుంచి తొమ్మిది మంది సభ్యులతో ఏపీఎస్‌ఈజీసీ ఏర్పాటైంది. ఎన్టీఆర్‌ జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ బృందం పర్యటించింది. క్షేత్రస్థాయి పర్యటనలో విజయవాడ సమీపంలోని నున్నలో నిర్మించిన ఫాంపాండ్‌ను పరిశీలించారు. అనంతరం జూపూడిలోని సాలిడ్‌ వేస్ట్‌ ప్రాసెసింగ్‌ సెంటర్‌ను సందర్శించారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల వివరాలను బృందం సభ్యులు డ్వామా ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ జె.సునీతను అడిగి తెలుసుకొన్నారు. నున్న సర్పంచ్‌ కె.సరళ, ఉప సర్పంచ్‌ కె.బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్‌ కన్సల్టెంట్‌ కె.శ్రీనివాస్‌, తదితరులు వున్నారు.

ఎన్నికల సమగ్ర సమాచారం చేరవేతలో..

సమన్వయంతో పనిచేయాలి

» సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌

కృష్ణలంక, మార్చి 6 : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో ఎన్నికల అధికారుల సూచనల మేరకు సమన్వయంతో పనిచేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ టి.విజయకుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. సాధారణ ఎన్నికల సందర్భంగా మీడియా సెంటర్‌, మీడియా సర్టిఫికెట్‌ మోనిటరింగ్‌ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా మోనిటరింగ్‌ కమిటీ (ఎంఎంసీ) సోషల్‌ మీడియా మోనిటరింగ్‌ కమిటీలు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు విజయకుమార్‌రెడ్డి గురువారం డీఐపీఆర్వో కార్యాలయాన్ని సందర్శించి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి ఏ అభ్యర్థి ఎంత మెజార్టీతో గెలుపొందింది.. సమీప ప్రత్యర్థి ఓట్లు తదితర వివరాలతో సమాచారాన్ని ప్రత్యేక బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్‌ అండ్‌ మోనిటరింగ్‌ కమిటీ (ఎంసీఎంసీ), మీడియా సెల్‌, సోషల్‌ మీడియా సెల్‌ ద్వారా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహించేందుకు కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి సూచనలను పరిగణలోకి తీసుకొని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. మీడియా ప్రతినిధులకు పోలింగ్‌, కౌంటింగ్‌ పాస్‌లు జారీ చేసేందుకు ఎన్నికల అధికారులకు నివేదికలు సమర్పించాలని తెలిపారు. కమిషనర్‌ వెంట డీఐపీఆర్‌ఓ యు.సురేంద్రనాథ్‌, డీపీఆర్వో మోహన్‌రావు, డివిజనల్‌ పీఆర్వో కె.రవి, ప్రచార సహాయకులు వి.వి.ప్రసాద్‌ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌

జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

» ఏపీ ఫిషర్‌మెన్‌ జేఏసీ చైర్మన్‌ సైకం రాజశేఖర్‌

ధర్నాచౌక్‌, మార్చి 6 : రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల జనాభా కలిగిన సాంప్రదాయ మత్స్యకార కులాలకు జనాభా దమాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలేదని ఏపీ ఫిషర్‌మెన్‌ జేఏసీ చైర్మన్‌ సైకం రాజశేఖర్‌ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రేపల్లె సీటును మత్స్యకారులకు కేటాయించే అంశంలో వైసీపీ తన మొండి వైఖరి విడనాడాలని డిమాండ్‌ చేశారు. టీడీపీ నుంచి విశాఖ దక్షిణం, కాకినాడ సిటీ, శ్రీకాళహస్తి, మంత్రాలయం, అసెంబ్లీ సీట్లను, జనసేన నుంచి నర్సాపురం, శ్రీకాళహస్తి, అవనిగడ్డ, మత్స్యకారులకు కేటాయించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం మత్స్యకారులకు తగినన్ని సీట్లు కేటాయించాలని, లేదంటే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని రాజకీయ పార్టీలను హెచ్చరించారు. జి.రామారావు, ఎం.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ధర్నాచౌక్‌, మార్చి 6 : వాటర్‌ సప్లయ్‌ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్‌.నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్‌ కాంట్రాక్టు ఎంప్లాయిస్‌ అండ్‌ కాంట్రాక్టు వర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. వాటర్‌ సప్లయ్‌ కార్మికులు చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. 6 నుంచి 23 నెలలుగా బకాయిలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని లేదంటే వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. యూనియన్‌ రాష్ట్ర కన్వీనర్‌ జి.ఓబులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి ముజఫర్‌ అహ్మద్‌, ఐఎఫ్‌టీయూ నేత పోలారి ఈ ధర్నాలో పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు.

గన్నవరంలో ఇస్రో చైర్మన్‌కు ఘనస్వాగతం

గన్నవరం : ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ సోమనాథ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి బుధవారం విచ్చేశారు. పలువురు పూలబొకేలు అందజేశారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.



నాగ శ్రావణ్‌ దీక్ష భగ్నం

» బలవంతంగా ప్రభుత్వాసుపత్రికి తరలింపు

వన్‌టౌన్‌, మార్చి 6 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ గత నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నాగశ్రావణ్‌ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాడు. నాలుగు రోజులుగా దీక్షలో ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పటమట స్టేషన్‌లోని గురునానక్‌ కాలనీ సెక్టార్‌ ఇన్‌స్పెక్టర్‌ వి.పద్మ సిబ్బందితో కలిసి దీక్ష విరమించాలని కోరారు. దానికి శ్రావణ్‌ అంగీకరించకపోవడంతో అదుపులోకి తీసుకుని వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అరెస్టు సమయంలో పలువురు టీడీపీ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించినా పోలీసులు పట్టించుకోకుండా ఆసుపత్రికి తరలించారు.



నాగశ్రావణ్‌ దీక్ష భగ్నం చేసి బలవంతంగా ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

చరిత్రలో నిలిచిపోయే దీక్ష

» నాగశ్రావణ్‌ను పరామర్శించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విద్యాధరపురం: యువతరం ఏకం కావాలని, వైసీపీకి చరమగీతం పాడాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో 4 రోజులుగా నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నష్టపోయిన ప్రతి యువకుడు తిరుగుబాటు చేయాల్సిన సమయం వచ్చిందని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ నాగశ్రావణ్‌ నిరవధిక నిరాహారదీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. శ్రావణ్‌ దీక్ష స్ఫూర్తిగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.



నాగశ్రావణ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

రానున్నది పసుపు సునామి

» బెజవాడలో గెలిచేది కేశినేని చిన్ని..
ఆడియో ఆవిష్కరణలో మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌

విద్యాధరపురం, మార్చి6 : ఇచ్చిన మాటకు కట్టుబడి, క్రమశిక్షణ నిబద్ధత, సేవా గుణాలు ఆభరణాలుగా గల కేశినేని శివనాథ్‌ (చిన్ని) విజయవాడ ఎంపీగా ఘన విజయం సాధిస్తారని మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌ ఆశాభావం వ్యక్తం చేశారు. గురునానక్‌ కాలనీలోని కేశినేని శివనాథ్‌ కార్యాలయం ఎన్టీఆర్‌ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'బెజవాడలో గెలిచేది కేశినేని చిన్ని' అనే మకుటంతో సాగిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రానున్నది పసుపు సునామి' అని టీడీపీ-జనసేన కూటమి గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని తెలిపారు. రెండు సంవత్సరాలుగా కేశినేని చిన్ని అనేక సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. కేశినేని చిన్నిపై రూపొందించిన పాట ప్రజల్లోకి చొచ్చుకుపోయి ప్రతిఇంట వినిపిస్తుందని పేర్కొన్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్‌ జనరల్‌ సెక్రటరీ పి.చరణ్‌సాయియాదవ్‌ ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు రంగం రాజేష్‌ రచించి ఆలపించారని తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్‌ జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు షేక్‌ కరీముల్లా, టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, కార్పొరేటర్‌ గాంధీ, టీఎన్‌టీయూసీ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు బి.నాని తదితరులు పాల్గొన్నారు.



కేశినేని శివనాథ్‌ ఆడియో ఆవిష్కరణలో మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌ తదితరులు

74 శాతం ఆర్యవైశ్యుల మద్దతు : చిన్ని

రాష్ట్రంలోని 74 శాతం మంది ఆర్యవైశ్యులు టీడీపీకి మద్దతు పలుకుతున్నారని కేశినేని చిన్ని అన్నారు. బుధవారం ఆర్యవైశ్యులు కేశినేని చిన్ని ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన చిన్ని మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు కార్యదక్షతకు నిదర్శనమన్నారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శి గొంట్లా రామ్‌మోహన్‌రావు, మట్టాసుబ్బారావులతో పాటు అత్యధికసంఖ్యలో పార్టీలో చేరారు. గద్దె రామ్మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్‌ కోనేరు శ్రీధర్‌, బొప్పన భవకుమార్‌, చెన్నుపాటి గాంధీ, గురునాథం నాగేశ్వరరావు, నరసింహచౌదరి, ముమ్మనేని ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఆర్యవైశ్య నాయకులు

వన్‌టౌన్‌ : విజయవాడకు చెందిన పలువురు ఆర్యవైశ్య నాయకులు బుధవారం ఉండవల్లిలోని నారా చంద్రబాబునాయుడు నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. చంద్రబాబు వారిని సాదరంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్‌ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు, దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు దరిశి వాసు, విజయవాడ అర్బన్‌ ఆర్యవైశ్య నాయకుడు కందుకూరు గోపి, లక్ష్మయ్య, సుబ్బారావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండీ రాకేశ్‌, అయోధ్యనగర్‌ కార్పొరేటర్‌ చెన్నగిరి రామ్‌మోహన్‌, విజయవాడ మార్కెట్‌ యార్డ్‌ మాజీ వైస్‌చైర్మన్‌ తుమ్మలపెంట శ్రీనివాస్‌, ఆర్యవైశ్య నాయకుడు జులూరి నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్‌, జె.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన దరిశి వాసు తదితరులు

రూ.13 లక్షల కోట్లు ఏమయ్యాయి జగన్‌?

» మాజీమంత్రి ఉమా సూటి ప్రశ్న

జి.కొండూరు, మార్చి 6 : ఐదేళ్ల పాలనలో సుమారు రూ.13 లక్షల కోట్ల అప్పు చేసి ఆ డబ్బుతో ప్రజల కనీస అవసరాలు సమకూర్చకుండా ఏం చేశావ్‌ జగన్మోహన్‌ రెడ్డి.. అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. కుంటముక్కలలో బుధవారం ఆయన శంఖారావంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ సూపర్‌ సిక్స్‌ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉమా మాట్లాడుతూ, పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదే అన్నారు. ఎయిడెడ్‌ స్కూల్స్‌ మూసేయించిన జగన్‌ ఎస్సీ విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేశారన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌ నిధులు పక్కదారి పట్టించిన జగన్‌ బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జువ్వా రామకృష్ణ, లంక రామకృష్ణ, సుకవాసి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

వన్‌టౌన్‌, మార్చి 6 : జాతీయ మానవ హక్కుల కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ అరుణ్‌ మిశ్రా దంపతులు, ఆయన బృందం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు, ఈవో రామరావు, జాయింట్‌ కలెక్టర్‌ సంపత్‌ కుమార్‌ వారికి సాదర స్వాగతం పలికారు. అరుణ్‌మిశ్రా దంపతులు పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు..

● దుర్గమ్మవారిని దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌ కరికాల వలన్‌ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామరావు స్వాగతం పలికారు, దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

● దుర్గగుడి ట్రస్ట్‌బోర్డుకు సభ్యురాలిగా నియామకమైన అమలాపురపు రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా నియామకమైన అల్లం భువన్‌కుమార్‌లు బుధవారం దుర్గగుడికివిచ్చేసి ఈవో రామరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ రాంబాబును కలిసారు. దుర్గమ్మవారిని దర్శించుకున్న అనంతరం బాధ్యతలు స్వీకరించారు.



జాతీయ మానవ హక్కుల కమిషన్‌ చైర్మన్‌ అరుణ్‌ మిశ్రాకు స్వాగతం పలికిన కలెక్టర్‌ ఢిల్లీరావు, ఈవో రామారావు తదితరులు

ధ్వజారోహణం..

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం మల్లేశ్వరాలయంలోని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక అర్చనలు చేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు వివిధ ఆగమోక్తంగా వివిధ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవో రామరావు,వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురువారం ఉదయం, సాయంత్రం సమయాలలో మండపారాధన, ఔపాసనలు బలిహరణ, మూలమంత్ర హవనాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతాయి



ధర్మపథం వేదికపై..

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన సూర్య ప్రభ సంగీత అకాడమీకి చెందిన లలిత, శ్రీనిత్య, సురేఖ, .జగన్మోహిని, అభిరామ్‌లు వివిధ కీర్తలను పాడి అలరించారు.

మండలితో జనసేన ఆశావహుల భేటీ!

అవనిగడ్డ, మార్చి 6 : తెలుగుదేశం-జనసేన పొత్తు నేపథ్యంలో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన సీటు ఆశిస్తున్న పలువురు ఆశావహులు బుధవారం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ను వేర్వేరుగా కలవటం చర్చనీయాంశంగా మారింది. అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించనున్నట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ తరపున ప్రముఖ వ్యాపారవేత్త విక్కృత్తి శ్రీనివాస్‌, జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, అక్షయ డెవలపర్స్‌ అధినేత మాదివాడ వెంకటకృష్ణ (బ్రదర్‌ క్రిస్టియన్‌), రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, సీనియర్‌ రాజకీయవేత్త బచ్చు వెంకటనాథ్‌ తదితరులు జనసేన తరపున పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం మాదివాడ వెంకటకృష్ణ బుద్ధప్రసాద్‌ను కలిసి గంటన్నర పైగా ఏకాంతంగా చర్చలు జరిపారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావులు బుద్ధప్రసాద్‌ను వేర్వేరుగా కలిసి చర్చలు జరిపారు. టీడీపీ తరపున బుద్ధప్రసాద్‌కు టిక్కెట్‌ వస్తే తాము మద్దతుగా ఉంటామని, అలా కానీపక్షంలో తమకు మద్దతునివ్వాలని వారు మండలిని కోరినట్టు సమాచారం. ఒకేరోజు జనసేన పార్టీ తరపున టిక్కెట్‌ ఆశిస్తున్న ముగ్గురు బుద్ధప్రసాద్‌తో చర్చ జరపటం దివి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

బుద్ధప్రసాద్‌కు అరుదైన గౌరవం

తెలుగు భాషా వికాసం కోసం విశేష కృషిచేస్తున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒకటైన న్యూజెర్సీ జనరల్‌ అసెంబ్లీ బుద్ధప్రసాద్‌కు తెలుగు భాషా వికాసంకోసం చేస్తున్న కృషిని అభినందిస్తూ తీర్మానాన్ని చేసి న్యూజెర్సీ మాజీ డిప్యూటీ స్పీకర్‌ చివుకుల ఉపేంద్ర ద్వారా గుంటూరులో విశ్వయోగి విశ్వంజీ సమక్షంలో బుద్ధప్రసాద్‌కు ప్రతిని అందజేశారు. బుద్ధప్రసాద్‌ను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి అసెంబ్లీ ఈ తీర్మానం చేసినట్టు చివుకుల ఉపేంద్ర తెలిపారు. ఈ తీర్మానం పట్ల బుద్ధప్రసాద్‌ హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలుగు భాషోద్యమకారులకు, తెలుగు ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ఆయన అన్నారు.



తీర్మానం ప్రతిని బుద్ధప్రసాద్‌కు ఇస్తున్న ఉపేంద్ర



వధూవరులుగా ముస్తాబైన గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులు

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

» ఇంద్రకీలాద్రిపై వధూవరులుగా అలంకృతులైన గంగా, పార్వతీ, మల్లేశ్వరులు

వన్‌టౌన్‌, మార్చి 6 : ఇంద్రకీలాద్రిపై గంగ, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులకు బుధవారం మంగళస్నానాలు చేయించి శివరాత్రి మహోత్సవాలకు సిద్ధం చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సంప్రదాయం, ఆచారాల మేరకు ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు చేయించారు. అనంతరం పట్టు వస్త్రాలను ధరింపజేసి వధూ వరులుగా సిద్ధం చేశారు. తొలుత శాస్త్రోక్త విధానంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఈవో రామారావు దంపతులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ రాంబాబు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న లక్ష్మీనారాయణ తదితరులు

ఓటుకు నోటును అడ్డుకోవాలి.. పంచితే పట్టివ్వాలి

» ఏపీ యునైటెడ్‌ ఫ్రంట్‌ కన్వీనర్‌ లక్ష్మీనారాయణ

ధర్నాచౌక్‌, మార్చి 6: రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటుకు నోటును నిరోధించాలని, ఎన్నికల కమిషన్‌ నిఘాకు తోడు తమ లాంటి పార్టీలు సైతం విజిలెన్స్‌ ఏర్పాటు చేయాలని ఏపీ యునైటెడ్‌ ఫ్రంట్‌ కన్వీనర్‌ వీవీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఫ్రంట్‌ నేతల సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఎన్నికల్లో డబ్బు పంచేవారికి చెక్‌ పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల కమిషన్‌ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. బీసీ ఐక్య వేదిక, సమతా సైనిక్‌దళ్‌, బీసీ చైతన్య సమితి, బోయి వాల్మీకి, నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం, ప్రజా సోషలిస్టు కూటమి, శెట్టి, బలిజ హక్కుల పోరాట కమిటీ, క్రిస్టియన్‌, మైనార్టీ హక్కుల పోరాట కమిటీ, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని ఏపీ యూనైటెడ్‌ ఫ్రంట్‌కు మద్దతు తెలిపారు. ఫ్రంట్‌ నేతలు పోతిన వెంకట రామారావు, శివభాగ్యారావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సెబ్‌ ఏఎస్పీ వెంకటేశ్వరరావు

206 కేజీల గంజాయి స్వాధీనం

గన్నవరం, మార్చి 6 : సెబ్‌ అధికారుల తనిఖీల్లో భాగంగా 206 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో(సెబ్‌) డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సెబ్‌ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణపై ప్రత్యేక నిఘా ఉంచి ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్‌గేటు వద్ద సెబ్‌ అధికారులు తనిఖీలు చేస్తుండగా తమిళనాడు వైపు వెళుతున్న ట్రాలీ లారీలో తరలిస్తున్న 97 ప్యాకెట్లలోని 206 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్‌కు చెందిన తాతపూడి దేవయ్య జోష్వజ్ఞానరాజ్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్టు తెలిపారు. అతడి నుంచి మూడు సెల్‌ఫోన్లు రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ వరాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 18 కో-ఎడ్యుకేషన్‌ జూనియర్‌ కళాశాలలు

మచిలీపట్నం టౌన్‌, మార్చి 6 : కృష్ణాజిల్లాలో ప్రస్తుతం ఉన్న 18 హైస్కూళ్లను అప్‌గ్రేడ్‌ చేస్తూ నూతనంగా 18 ఇంటర్‌ కో-ఎడ్యుకేషన్‌ జూనియర్‌ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందని డీఈవో తాహెరా సుల్తానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఇసీ గ్రూపులు నిర్వహిస్తారన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులు ఉండేలా చూడాలన్నారు. 2024-25 సంవత్సరంలో ప్రారంభించే ఈ కళాశాలలను డీఈవో వివరించారు. అవనిగడ్డ, బంటుమిల్లి జూనియర్‌ కళాశాలలు, బాపులపాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, చల్లపల్లి, గన్నవరం మండలం దావాజీగూడెం, ఘంటసాల మండలం శ్రీకాకుళం, గుడివాడలోని బేతవోలు మునిసిపల్‌ హైస్కూల్‌, గుడ్లవల్లేరు మండలం కౌతవరం, గూడూరు, కంకిపాడు, కోడూరు మండలం వి.కొత్తపల్లి, కృత్తివెన్ను మండలం సంగమూడి, బందరు రూరల్‌ మండలం చిన్నాపురం, మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి, నాగాయలంక మండలం తలగడదీవి, నందివాడ మండలం రుద్రపాక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలు, పామర్రు, మొవ్వ క్షేత్రయ్య జూనియర్‌ కళాశాలలో కో-ఎడ్యుకేషన్‌ ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వం గతంలో 25 ఉన్నత పాఠశాలలను బాలికల జూనియర్‌ కళాశాలలుగా రూపొందించిన సంగతి తెలిసిందే.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

సృజనాత్మకతను వెలికితీసేందుకు ఫెస్ట్‌లు దోహదం

ఎనికేపాడు(గన్నవరం), మార్చి 6 : ఎనికేపాడు విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ మహిళా కళాశాలలో బుధవారం సావిష్కార్ 2కె24 వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కన్సల్టెంట్ హైటెక్ ఇండియా లిమిటెడ్ సీనియర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మురళీకృష్ణ మైక్రోలింక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ వి.గోవిందరాజులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఎస్ఆర్‌కె ఫౌండేషన్ బోర్డు సభ్యురాలు బి.సంగీత మాట్లాడుతూ, పోటీతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం ఉండాలని చెప్పారు. డాక్టర్ బి.స్వప్న, ప్రిన్సిపాల్ డాక్టర్ చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైకోను సాగనంపడమే లక్ష్యం

పోరంకి, కంకిపాడులో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు బీసీ నాయకుల పాలాభిషేకం



పోరంకిలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

పెనమలూరు, మార్చి 6 : రాష్ట్రంలోని బీసీలంతా కలిసికట్టుగా పనిచేసి సైకో జగన్‌రెడ్డిని సాగనంపడమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ బీసీ నాయకులు సంగెపు రంగారావు, పీతా గోపీచంద్ పేర్కొన్నారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాటి బీసీ డిక్లరేషన్‌కు కృతజ్ఞతగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు టీడీపీకి అండగా ఉంటూ ఉన్నతికి టీడీపీ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. బీసీలు మరింత అభ్యున్నతి చెందడానికి ప్రత్యేకంగా బీసీ డిక్లరేషన్ ప్రకటించినదుకు తాము ఎంతో గర్వపడుతున్నామని తెలిపారు. పార్టీ కోసం గత నాలుగున్నరేళ్లుగా కష్టపడుతున్న బోడె ప్రసాద్‌ను పెనమలూరు అభ్యర్థిగా వచ్చే జాబితాలో ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అంగిరేకుల మురళి, కొణతం సుబ్రహ్మణ్యం, తమ్ము అశోక్, కోసూరి రమేష్, తుమ్మల రాంకుమార్, యార్లగడ్డ సుచిత్ర, మేడసాని రత్నకుమారి, పండల రజిని, బొల్లు నాగమణి, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ఘట్టం..

జయహో బీసీ సభలో రాష్ట్రంలో 50ఏళ్ల దాటిన ప్రతి బీసీ వ్యక్తికి నాలుగువేల పింఛన్ ప్రకటించడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమయిందని, చంద్రబాబు ముందుచూపునకు ఇది నిదర్శనమని, చారిత్రక ఘట్టమని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. కానూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీకి బీసీలే వెన్నెముక అని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమగ్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో కోసూరి రమేష్, కోటేశ్వరరావు, ఆదిశేషు, సుబ్రహ్మణ్యం, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో..

వైసీపీకి ఓటమి భయం..

కంకిపాడు : తెలుగుదేశం, జనసేన పార్టీ సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సెంగెపు రంగారావు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర ఆధ్వర్యంలో కంకిపాడులో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీలను నట్టేట ముంచిందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో 50 ఏళ్లకే పింఛన్ రూ. 4 వేలు ప్రకటించటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, బొప్పూడి శివరామకృష్ణ, గొగినేని వెంకట రమణ, ఏనుగ జయప్రకాష్, వణుకూరు విక్రం, అన్నవరపు శివపార్వతి, కళ్యాణి, డిఎన్ఆర్, నాగరాజు, సలీం, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, ప్రచార కమిటీ జిల్లా కో- ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు, నాగశ్రీ, తాతపూడి గణేష్, పిచుక క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

పెనమలూరు, మార్చి 6 : కానూరులో ఒక యువకుడు ఉరేసుకుని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కానూరు వినాయక్‌నగర్ ధన కోటేశ్వరరావు వీధిలో నివసిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని మహ్మద్ నఫీజా బేగం కుమారుడు మహ్మద్ ఫర్ఖాన్(21) బుధవారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. అతను బీఫార్మసీ చదువుతూ త్వరలో అమెరికా వెళ్లనున్నట్లు తెలిసింది.

ఘనంగా సితార్-2024



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శంకర్ విశ్వనాథన్

పెనమలూరు, మార్చి 6 : స్థానిక పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సితార్- 2024 కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి రెండువేలకు పైగా విద్యార్థులు పాల్గొని సుమారు 30 సాంకేతిక, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చెన్నై ఫిలిప్స్ జనరల్ మేనేజర్ శంకర్ విశ్వనాథన్ మాట్లాడుతూ, కమ్యూనికేషన్, రవాణా నుంచి హెల్త్‌కేర్, కనెక్టివిటీ వరకు అన్నింటిలో సాంకేతికత ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ నాగ భూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, పాల్గొన్నారు.

ఏఎంసీలో గోదాములు ప్రారంభం

గన్నవరం, మార్చి 6 : వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రూ.11.88 కోట్లతో నిర్మించిన గోదాములు, 60 టన్నుల కెపాసిటీ కలిగిన లారీ వే‌బ్రిడ్జిని బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏఎంసీ ఛైర్ పర్సన్ తోట కరుణతో కలసి ప్రారంభించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్ ఇమాం అన్నారు. మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమాం మాట్లాడుతూ, ఇంటికి దీపం ఇల్లాలు కనుక ఇల్లాలు చదువుకుంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. బి.లక్ష్మీ, అరుణలత, షేక్ షాకీరా, ఆసియాలను దుశ్శాలువ పూల బొకేతో సత్కరించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు, సీఆర్‌పీ దుర్గాదేవి, హసీనా, అశోక్ రాణి తదితరులు పాల్గొన్నారు.

దంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గన్నవరం, మార్చి 6 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణ గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ దంత వ్యాధి నిర్మూలన దినోత్సవం బుధవారం నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ దీపికల సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోయ సురేంద్ర మాట్లాడుతూ, దంత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చిప్పాడ చంద్రశేఖరరావు, విక్టర్‌బాబు, నాగేశ్వరరావు, మూర్తి, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణపై అవగాహన ఉండాలి



కంటి వైద్యులతో సుబ్రహ్మణ్యం, చైతన్యవాసు, మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 6 : కంటి సంరక్షణ, దృష్టిలోపం తదితర విషయాలపై అవగాహన ఉండాలని దీపక్ నెక్స్‌జన్ ఫుడ్స్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జన్ ఆధ్వర్యంలో మానవత సేవా సంస్థ పర్యవేక్షణలో వేమగిరి కంటి వైద్యశాల సహకారంతో బుధవారం ప్రజలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. కొయ్యూరు, బొమ్ము లూరు, తదితర గ్రామాలకు చెందిన 532 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, 270మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన 11మందికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు కంటి ఆసుపత్రికి దీపక్ నెక్స్‌జన్ ప్రతి నిధులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దీపక్ నెక్స్‌జెన్ డైరెక్టర్ చైతన్యవాసు, మున్నా, సత్యనారాయణ, మానవత ప్రతినిధులు నిర్మల, సుబ్ర హ్మణ్యం, ఫ్యాక్టరీ ప్రతినిధులు రాజేంద్ర, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వ కలయిక

ప్రముఖ న్యాయవాది రమణను కలిసిన ఎమ్మెల్యే పార్థసారథి



గన్నవరం, మార్చి 6 : పెనమలూరు ఎమ్మెల్యే, నూజివీడు టీడీపీ ఇన్‌చార్జి కొలుసు పార్థ సారథి ప్రముఖ న్యాయవాది కెవి రమణను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. అనంతరం సారథిని దుశ్శాలువాతో సత్కరించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు, కొడేటి కొండలరావు, నెరుసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించాలి



ధర్నా చేస్తున్న క్రైస్తవులు

ఉయ్యూరు, మార్చి 6 : ఉయ్యూరు పట్టణ పరిధి గురజాడ డొంక ప్రాంతంలో క్రైస్తవ సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించి పట్టణ క్రైస్తవ సమాజానికి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం క్రైస్తవులు నగర పంచాయతీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం ప్రధాన సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు పరిమి సుధాకర్ మాట్లాడుతూ, గురజాడ డొంక సమాధుల స్థలంలోకి వెళ్లే దారిలో రెండు పాకలు వేసి ఆక్రమించుకోవడంతో చనిపోయిన వారిని సమాధి చేసేందుకు వీలులేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఇటీవల మంత్రి జోగి రమేశ్ ను కలసి మొరపెట్టుకున్నా ఫలితం లేదని, ఆక్రమణలు తొలగించి సమాధుల స్థలం బాగు చేసుకునేందుకు మేమే పూనుకుంటే అధికార పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్ అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్టర్లు పుల్లయ్య, జాన్‌డేవిడ్, జోషి, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తికాకుండానే హడావిడి!



నిర్మాణ దశలో ఏటీఎం కౌంటర్

హనుమాన్‌జంక్షన్, మార్చి 6 : కేడీసీసీ హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ నూతన భవనం నిర్మాణం పూర్తి కాకుండానే బుధవారం హడావిడిగా ప్రారంభోత్సవం నిర్వహించారు. భవనాన్ని కేడీసీసీ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. రూ.1.26కోట్లు అంచనా వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణం పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. కాంపౌండ్‌వాల్ నిర్మాణం ఇంకా చేపట్టలేదు. బ్యాంకు ఎదుట ఏర్పాటు చేసిన ఏటీఎం కౌంటర్ పూర్తి కాలేదు. ఏటీఎం మిషన్ కూడా ఏర్పాటు చేయలేదు. బ్యాంకు లోపల కూడా గదులు మాత్రమే నిర్మించారు. అరకొరగా ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. లాకర్ గదిలో లాకర్ లేదు. కేవలం భవనం నిర్మించి గదులు మాత్రమే రూపొందించారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకుండానే భవనాన్ని ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ ముందుకు వస్తే ప్రారంభించే అవకాశం దుక్కుతుందో లేదో అన్న ఆరాటంతో పాలకవర్గం ప్రారంభోత్సవం చేసినట్టు కనిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే హాజరు అవుతారని ప్రచారం చేశారు. కాని ఆయన రాలేదు. మండల స్థాయి వైసీపీ ప్రజాప్రతినిధులు మాత్రం హాజరయ్యారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



బాపులపాడులో టీడీపీ నేతల ప్రచారం

హనుమాన్‌జంక్షన్, మార్చి 6 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జంక్షన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాపులపాడు గ్రామంలోని పలు వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గన్నవరం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని కోరుతూ ప్రచారం సాగించారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, వడ్లిల్లి లక్ష్మీ, గార్లపాటి రాజేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండే వ్యక్తిని గెలిపించండి

నెప్పల్లి (కంకిపాడు) : ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ అన్నారు. మండలంలోని నెప్పల్లి లో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె హేమ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేసే వ్యక్తిని ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, కొలుసు గోవిందరావు, ఈడుపుగంటి కిరణ్, కోలవెన్ను శివరామ, ఉషారాణి, నాని, గోగినేని వెంకటరమణ, ఏనుగ జయప్రకాష్, కొండా నాగేశ్వరరావు, ఆళ్లపాటి నాని, కొలుసు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



పోలీసు ఔట్‌పోస్టు శిలాఫలకం ప్రారంభోత్సవంలో ఎస్పీ, తదితరులు

యనమలకుదురులో పోలీసు ఔట్‌పోస్టు

పెనమలూరు, మార్చి 6 : పెనమలూరు పోలీసుస్టేషన్ పరిధిలోని యనమలకుదురులో బుధవారం కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు ఔట్‌పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి ఔట్‌పోస్టు ఉండడం ప్రజలకు ఉపయోగకరమని, పోలీసుల సేవలు స్థానికులకు మరింత అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోలీస్ విజిబిలిటీ పెరగడం వల్ల శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని, ఔట్‌పోస్టు ఏర్పాటుకు సహకరించిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ట్రస్టు ఛైర్మన్ సంగా నరసింహారావును ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో గన్నవరం డీఎస్పీ జయసూర్య, సీఐ టీవీవీ రామారావు, ఆలయ ఈఓ గంగాధర్, ఎస్ఐలు రమేష్, ఏసేబు, శేషకుమార్, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్‌లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు

గన్నవరం, మార్చి 6 : రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని గన్నవరం ట్రాఫిక్ సీఐ వి.పెద్దిరాజు అన్నారు. గన్నవరం పట్టణంలో బుధవారం ఆటో డ్రైవర్‌లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్‌లు, ఆటోలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్‌లు మాట్లాడకూడదని వివరించారు. అలాగే దావాజీగూడెం ఎస్‌టీటీఎఫ్ కళాశాలలో హెల్మెట్ ధరించటం వల్ల కలిగే ఉపయోగాలు, డ్రైవింగ్ లైసెన్స్ గురించి వివరించారు. ఏవో పద్మజ పాల్గొన్నారు.

ఉంగుటూరు ఎంఈవో-1గా రవికుమార్

ఉంగుటూరు, మార్చి 6 : మండల విద్యాశాఖాధికారి-1గా కొండా రవికుమార్ నియ మితులైనారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) తాహెరా సుల్తానా సిఫారసుల మేరకు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జోన్-2(కాకినాడ) జి.నాగమణి ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈవోగా విధులు నిర్వహించిన తోట్లవల్లూరు ఎంఈవో జి.వెంకటేశ్వరరావుపై వేధింపుల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉయ్యూరు డీవైఈవో ఐ.పద్మారాణి ఇటీవల విచారణ జరిపిన సంగతి పాఠకులకు విదితమే.

ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు

ఉంగుటూరు, మార్చి 6 : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటమే కేడీసీసీ బ్యాంక్ లక్ష్యమని బ్యాంక్ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. ఉంగుటూరులో రూ.1.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కేడీసీసీ ఉంగుటూరు బ్రాంచ్ భవనాన్ని బుధవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్, జీఎం రంగబాబు, డైరెక్టర్లు, ఛైర్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

మచిలీపట్నం టౌన్, మార్చి 6 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజులు తెలిపారు. బుధవారం డిపో మేనేజరు మీడియాతో మాట్లాడారు. 7వ తేదీ సాయంత్రం నుంచి 8వ తేదీ సాయంత్రం వరకు శైవ పుణ్యక్షేత్రాలైన పెదకళ్లేపల్లి, ఐలూరు, కృత్తివెన్నులకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. మచిలీపట్నం నుంచి పెదకళ్లేపల్లికి 15, ఐలూరుకు మచిలీపట్నం, కూచిపూడి, పామర్రు నుంచి 15 బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. కృత్తివెన్ను, శ్రీశైలంలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు.

చకచకా శివరాత్రి ఏర్పాట్లు

• కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమాలు
• ఎడ్లంక వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు



మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మచిలీపట్నం టౌన్ : స్థానిక చమ్మనగిరిపేటలో మహిషాసురమర్దనీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం దేవాలయ ఆవరణలో మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలను చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి యెండూరి సురేష్, కోశాధికారి చేబ్రోలు నాగలక్ష్మి గాయత్రి, ప్రధాన అర్చకుడు చేబ్రోలు బాబీ ఆవిష్కరించారు.



ఎడ్లంకలో ఆలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఉద్యోగులు

అవనిగడ్డ రూరల్ : మండల పరిధిలోని పాత ఎడ్లంకలో బాలకోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. పాత ఎడ్లంక వద్ద గల కృష్ణా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించటానికి అనువుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే చలువ పందిళ్లు వేసి ఆలయాన్ని ముస్తాబు చేశారు. బాలకోటేశ్వరస్వామివారిని దర్శించుకోవటానికి బారికేడ్లు ఏర్పాటు చేసే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నం టౌన్ : స్థానిక రాబర్టుసన్‌పేటలోని సుప్రసిద్ధ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం వైభవంగా స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం గోపూజ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఆలయ పాలకవర్గ మాజీ చైర్మన్ దేసు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, నీరజ దంపతులు పాల్గొన్నారు.

వీకేఆర్ అండ్ వీఎన్‌బీ విద్యార్థులకు కీమో నగదు పురస్కారాలు

గుడివాడ : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా డచ్ దేశపు అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ కీమో బీటెక్ విద్యార్థులకు కృత్రిమ మేథస్సుపై పోటీని నిర్వహించింది. ఈ పోటీల్లో పాల్గొన్న కంప్యూటర్స్ బ్రాంచ్ విద్యార్థులు ముక్కు ప్రవీణ్, ఐనంపూడి హరి, అల్లం హేమలత, చలాది హారిక, చిత్తూరి ధనుష్, జుజ్జవరపు కౌషిక్, కె.నాగకవిత, మన్నే దివ్య, ఎన్.చందులకు ఒక్కొక్కరికి రూ.15వేల చెక్కు, ప్రశంసాపత్రాలను కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్ అందజేశారు.

రంజాన్ తోఫా పంపిణీ

గుడివాడ రూరల్ : మల్లాయిపాలెం గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము యూత్ ఆధ్వర్యంలో బుధవారం రంజాన్ తోఫాను ముస్లింలకు పంపిణీ చేశారు. వెనిగండ్ల రాము మేనల్లుడు పిన్నమనేని ప్రతాప్ ఆధ్వర్యంలో 500 కుటుంబాలకు మల్లాయిపాలెంలో ముస్లింలకు ఇంటింటికీ రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్టంగా తయారైందని అన్నారు.

నానికి టీడీపీని విమర్శించే అర్హత లేదు

మాజీ ఎమ్మెల్యే రావి

గుడివాడ : స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానికి టీడీపీని విమర్శించే అర్హత లేదని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదికలో విలేకర్లతో మాట్లాడుతూ ఎంత తీసుకుని జైలులో ఉన్న జగన్‌రెడ్డిని కలిశాడో నాని చెప్పాలన్నారు.

రక్తదానంతో ఎంతో మేలు

మచిలీపట్నం టౌన్ : అన్ని దానాల్లో రక్తదానం మిన్న అని మాజీ ఎంపీ, హిందూ కళాశాల అనుబంధ సంస్థల అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. దైతా మధుసూదనరావు సంస్మరణ సభ సందర్భంగా హెల్పింగ్ స్పాట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ మాట్లాడారు.



పింగళి స్వగ్రామానికి రహదారి లేకపోవడం దారుణం

• వర్ల కుమార్ రాజా



భట్లపెనుమర్రులో కుమార్ రాజాకు స్వాగతం పలుతుకున్న గ్రామస్థులు

కూచిపూడి, మార్చి 6 : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వగ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవటం విచారకరమని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా విమర్శించారు. పల్లెబాట రెండవ రోజైన బుధవారం భట్లపెనుమర్రు గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గ్రామాల అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

జగన్ పాలనలో దోచుకోవడం.. దాచుకోవడమే!

• కాగిత కృష్ణప్రసాద్



కప్పలదొడ్డిలో చేనేత రాట్నం తిప్పుతున్న కృష్ణప్రసాద్

పెడన : దాచుకోవడం, దోచుకోవడమే పనిగా పెట్టుకున్న అవినీతి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని పెడన నియోజకవర్గ టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఆయన జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్‌తో కలిసి బుధవారం గూడూరు మండలం కప్పలదొడ్డిలో విస్తృతంగా పర్యటించి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను, బీసీ డిక్లరేషన్‌ను వివరించారు. కృష్ణప్రసాద్ సూపర్‌సిక్స్ పథకాల క్యాలెండర్లను ఇంటింటికీ పంపిణీ చేశారు.

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

నాగాయలంక : గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'జయహో బీసీ' సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ పట్ల బీసీ నేత, ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నాగాయలంకలోని మత్స్య భవనం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఈ డిక్లరేషన్ రాష్ట్రంలోని బీసీల ఆర్థిక అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు.

సంప్రదాయ వనరుల వినియోగంపై అవగాహన

చల్లపల్లి, మార్చి 6 : సంప్రదాయ వనరుల వినియోగంపై స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టెమ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంప్రదాయ వనరులు అయినటువంటి సౌరశక్తిని ఉపయోగించి భూమిలో ఏర్పడిన విష వాయువులను ఏ విధంగా తగ్గించుకోవచ్చు, సోలార్ ప్యానల్స్ తయారీ, ఉపయోగించుకునే విధానాలపై శాస్త్రవేత్త శ్రీనివాసరావు విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు.

ప్రశాంతంగా ఎన్నికలు అందరి బాధ్యత

చల్లపల్లి : ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చల్లపల్లి తహసీల్దార్ బి.సుమతి పేర్కొన్నారు. చల్లపల్లి మండలంలోని బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులు, పోలీసు సెక్టార్ అధికారుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లపరంగా ఏమైనా సమస్యలు ఉంటే బీఎల్‌వోలు గుర్తించి తెలియజేయాలన్నారు. చల్లపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.నాగ ప్రసాద్ మాట్లాడుతూ చల్లపల్లి మండలంలో నాలుగు టిపికల్ పోలింగ్ లొకేషన్లను, 8 టిపికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్టు తెలిపారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

• అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ బీసీ నేతలు



బీసీ డిక్లరేషన్ ప్రతులు చూపుతున్న టీడీపీ నాయకులు

అవనిగడ్డ : బీసీలు అంటే వెనుకబడిన వర్గాలు కాదని, సామాజిక వెన్నుముక వంటి వారు అని గుర్తించి టీడీపీ మాత్రమే వారికి ప్రాధాన్యత కల్పిస్తుందని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ నేతలు అన్నారు. మంగళవారం టీడీపీ - జనసేన పార్టీల ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ ఇచ్చినందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లుక్కా పిచ్చియ్య, షేక్ బాబావలి, కొక్కిలిగడ్డ నాగరాజు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుడివాడ రూరల్, మార్చి 6 : మండల పరిధిలోని మోటూరు గ్రామంలో రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న మండల పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొడాలి నాని శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం మండల పరిధిలోని ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ మట్టా నాగమణి, జాన్ విక్టర్, ఎంపీపీ గద్దె పుష్పరాణి, జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, ఎంపీటీసీ గొర్రె వరలక్ష్మి, సర్పంచ్ కె.పద్మ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

జల క్రీడ పోటీల్లో నాగాయలంక క్రీడాకారిణి



నగిడి గాయత్రి

మచిలీపట్నం టౌన్, మార్చి 6 : ఆసియా ఖండ స్థాయిలో థాయ్‌లాండ్‌లో జరుగుతున్న జలక్రీడ (కెనాయింగ్) పోటీల్లో కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన క్రీడాకారిణి నగిడి గాయత్రి పాల్గొంటోంది. థాయ్‌లాండ్ వెళ్లిన గాయత్రి బుధవారం మొదటి దశలో జరిగిన పోటీల్లో 5వ స్థానంలో నిలిచింది. గురు, శుక్రవారాల్లో జరిగే పోటీలకు గాయత్రి అర్హత సాధించినట్టు జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె. ఝాన్సీలక్ష్మి తెలిపారు.

కామరాజుకు ప్రతిష్టాత్మక అవార్డు

గుడ్లవల్లేరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చర్స్ సొసైటీ ఇచ్చే ప్రతిష్టాత్మక 'టైటాన్ అచీవ్‌మెంట్' అవార్డును స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఆర్‌జీఈసీ) అకడమిక్ స్ట్రెంగ్థనింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కామరాజు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. కామరాజు అందుకొన్న అవార్డు వివరాలను బుధవారం కరుణకుమార్ తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో మేలు

పెదపారుపూడి : ప్రభుత్వ పథకాలను అందించటంలో సచివాలయ వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని చిన్నపారుపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

మా పార్టీకి ఓటేస్తేనే పట్టా

• ఇళ్ల పట్టాల పంపిణీలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి

పమిడిముక్కల, మార్చి 6 : పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలో పేదల ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీలో అధికార పార్టీ నాయకులు మితిమీరి ప్రవర్తిస్తూ అర్హులైన వారిని ఒత్తిడికి గురిచేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. తాడంకిలో పేదల ఇళ్ల పట్టాలివ్వకుండా అర్హులను ముప్పతిప్పలు పెడుతూ తిప్పించుకోవడమే కాక వత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం మండల తహసీల్దార్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన నూతన గ్రామ సచివాలయ భవనం ప్రారంభ రోజున ఎమ్మెల్యే చేత కొన్ని పట్టిలిప్పించి మిగిలినవి స్థానిక పార్టీ నాయకుల ఇంటివద్ద ఉంచుకుని ఇవ్వకుండా తిప్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ఇవ్వకుండా వారి వద్ద ఉంచుకున్న పట్టాలు స్వాధీనపరుచుకుని అర్హులైన వారికి పట్టాలిప్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కొల్లూరి బాబ్జి, నాదెళ్ల సుబ్రహ్మణ్యం, అబ్బాస్ అలీ, బోలెం లక్ష్మీనారాయణ, ఆముదాలపల్లి గోపాలకృష్ణ తహసీల్దార్‌ను కలిసినవారిలో ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ హత్య కేసులో నిందితులపై చర్యలు తీసుకోవాలి

• ఫొటోగ్రాఫర్లు కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు

మచిలీపట్నం టౌన్ : రావులపాలెంలో హత్యకు గురైన మదురవాడ ఫొటోగ్రాఫర్ సాయికుమార్‌ను హత్య చేసిన వారిని చట్టరీత్యా శిక్షించాలని మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జిల్లా పరిషత్ సెంటర్‌లోని డాగూరే విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు చిలంకుర్తి శేషు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో కార్యదర్శి అనంత్, ఉపాధ్యక్షుడు పుప్పాల హరిరామకృష్ణ, కోశాధికారి శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ హరి, రాకేష్, ప్రసాద్, శ్రీనివాస్, పాషా పాల్గొన్నారు.

'కాగిత' గెలుపునకు కృషి చేస్తాం

• టీడీపీ, జనసేన కార్యకర్తలు

బంటుమిల్లి : మండలంలోని మణిమేశ్వరం గ్రామంలో సీనియర్ నాయకులు సర్పంచ్ దింటకుర్తి మధుసూదనరావు నాయకత్వంలో దాదాపు 500 మంది వైసీపీ, జనసేన కార్యకర్తలు పెడన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వివిధ అంశాలను కూలంకుషంగా చర్చించిన అనంతరం కాగిత కృష్ణప్రసాద్ నాయకత్వంలో పని చేసి ఆయన గెలుపుకోసం పని చేస్తామన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థులకు పతకాలు

గుడివాడ : ఈ నెల 3వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన టీమ్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో డా.కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు పలు పతకాలను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. బాలికల విభాగంలో 5వ తరగతి విద్యార్థులు ఎల్.తేజశ్రీ, ఎ.తనిరిక, ఎల్.పార్వతి షణ్ముఖ శ్రీల జట్టు తృతీయ స్థానం, బాలుర విభాగంలో కె.తీమ్‌కృష్ణ, ఎన్.సిద్ధార్థ, జె.హనీష్ బెస్ట్ ప్లేయర్స్‌గా నిలిచారన్నారు.

రాజకీయ భవిష్యత్తుపై త్వరలో చెబుతా

• బూరగడ్డ వేదవ్యాస్

బంటుమిల్లి, మార్చి 6: రాజకీయ భవిష్యత్తుపై త్వరలోనే కీలక ప్రకటన చేస్తానని మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ తెలిపారు. బుధవారం రాత్రి పెందుర్రు గ్రామంలో కార్యకర్తలు, అభిమానులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై చర్చించారు.

నూజివీడు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నవీన లావణ్య లత

మచిలీపట్నం టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా నవీన లావణ్య లతను నియమిస్తూ ఉపకులపతి జి.జ్ఞానమణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి జి.జ్ఞానమణి వెల్లడించారు. మొత్తం 9024 మంది విద్యార్థులు కాగా 5312 మంది హాజరయ్యారు. 58.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. పునః మూల్యాంకనం కావలసిన విద్యార్థులు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేరుకే పదవి..

• సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన

పెదపారుపూడి, మార్చి 6 : గ్రామాల్లో పేరుకే సర్పంచ్‌లుగా ఉన్నాం గానీ ప్రజా సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగింది. వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనుల వివరాలను తెలియజేశారు. సర్పంచ్‌లకు నిధులు విడుదల చేయకపోవటంతో ప్రజలకు ఏ సమస్యలను పరిష్కరించలేకపోతున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం కాకపోవటంపై ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు.

ఘాట్ వద్ద పూడికతీత పనులు

మోపిదేవి : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో ఈనెల 8, 9 తేదీల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్నానఘాట్ల వద్ద మరమ్మతు పనులు బుధవారం చేపట్టారు. లక్ష మందికిపైగా భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తారనే అంచనాతో మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి ఆధ్వర్యంలో ఆర్‌సీ శాఖ ఉద్యోగులు మరమ్మతులు పనులు చేపట్టారు.

రూ.50వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ చరిత్రాత్మకం : వెనిగండ్ల

గుడివాడ : టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో బీసీ సోదరుల స్థితిగతులు సమూలంగా మారతాయని, రూ.50వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ చరిత్రాత్మకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. జయహో బీసీ సదస్సు విజయవంతమైన సందర్భంగా బుధవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్ మాట్లాడారు.

ఆజాద్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తా

గుడివాడలో మౌలానా కలాం ఆజాద్ సెంటర్‌ను నెలకొల్పుతానని, 3 ఎకరాల్లో నిర్మించి దానిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజిటల్, ఉర్దూ లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్ వంటివి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నానని వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక కవులూరి కల్యాణమండపంలో వెనిగండ్ల ఆధ్వర్యంలో మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నందివాడ (ఇలపర్రు) : గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమంటూ బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇలపర్రు గ్రామంలో మహిళలు వెనిగండ్లకు హారతులు ఇచ్చి గజ మాలతో సత్కరించారు.





